సాక్షి
అనంతపురం

సోమవారం । 29 । సెప్టెంబర్ । 2025



కొలిస్తే 'చింతల'న్నీ దూరం

తాడిపత్రిలో ఈ నెల 30న భూదేవి, శ్రీదేవి సమేత చింతలరాయుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి.

8లో



స్నేహితుడిపై కత్తితో దాడి

స్నేహితుడిపై ఓ వ్యక్తి కత్తితో దాడి చేసిన ఘటన తాడిపత్రి పట్టణంలో ఆదివారం కలకలం రేపింది.

8లో

గరిష్ఠం/కనిష్ఠం

34.2°/21.4°

జిల్లా అంతటా ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి నుంచి పశ్చిమ దిశగా గంటకు 8 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో 'పరిష్కార వేదిక'



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆనంద్ (ఫైల్)

అనంతపురం అర్బన్: 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఓ.ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. రెవెన్యూ భవన్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరగనున్న కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలను అర్జీ రూపంలో అధికారులకు సమర్పించాలన్నారు. అర్జీతో పాటు ఫోన్, ఆధార్ నంబర్లు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. గతంలో అర్జీ ఇచ్చి ఉంటే దానికి సంబంధించి రసీదు తీసుకు రావాలన్నారు. సమర్పించిన అర్జీ పరిష్కార స్థితి గురించి కాల్‌సెంటర్ 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు.

జాషువా సాహిత్యంపై రోజంతా చర్చించినా తక్కువే

- మంత్రి సత్యకుమార్ యాదవ్



జాషువా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

అనంతపురం టవర్‌క్లాక్: కవి గుర్రం జాషువా సాహిత్యం గురించి రోజంతా చర్చించినా తక్కువే అవుతుందని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. నగరంలో ఆదివారం నిర్వహించిన జాషువా 130వ జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా ఆర్ట్స్ కళాశాల వద్ద జాషువా విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం అలెగ్జాండర్ ఫంక్షన్ హాలులో నిర్వహించిన సమావేశంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడారు. గుర్రం జాషువా తెలుగుజాతి ముద్దు బిడ్డ అన్నారు. ఆయన కవిత్వం ఎంత విస్తారమో అంత వైవిధ్యమన్నారు. ప్రతీ అంశాన్ని తనదైన శైలిలో మలిచి తెలుగు సాహిత్యానికి కొత్త దిశను చూపారన్నారు. అలాంటి మహానుభావుడు తెలుగు వారు కావడం మన అదృష్టమన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సందిరెడ్డి శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుడిసె దేవానంద్, జిల్లా అధ్యక్షుడు రాజేష్, నాయకులు చిరంజీవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుస్తీ విజేత 'అనంత'

- ద్వితీయస్థానంలో చిత్తూరు, తృతీయ స్థానంలో శ్రీసత్యసాయి జిల్లాలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డీఎస్పీ మహేష్, తదితరులు

హిందూపురం టౌన్: రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల విజేతగా అనంతపురం నిలిచింది. ద్వితీయ స్థానంలో తిరుపతి, తృతీయ స్థానంలో శ్రీసత్యసాయి జిల్లాలు నిలిచాయి. హిందూపురంలో రెండురోజులుగా నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ 5వ రాష్ట్రస్థాయి కుస్తీ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ముగిశాయి. అన్ని జిల్లాల నుంచి 106 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. 36 కేటగిరీల్లో పోటీలు జరిగాయి. ఇందులో 36 మంది విజేతలుగా నిలిచారు. వీరు నవంబర్ ఒకటో తేదీ నుంచి అయోధ్యలో నిర్వహించే జాతీయస్థాయి కుస్తీ పోటీల్లో పాల్గొననున్నారు.

సైకిల్‌పై నుంచి పడి బాలుడి మృతి

యాడికి: సైకిల్ తొక్కుతూ కింద పడి బాలుడు మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో జరిగింది. వివరాలు.. మండల కేంద్రంలో కూల్ డ్రింకు షాపు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న అశోక్‌కు ఇద్దరు కుమారులు సంతానం. పెద్ద కుమారుడు మదన్ సాయి (15) కర్నూలులో 10వ తరగతి చదువుతున్నాడు. దసరా సెలవుల నేపథ్యంలో ఇటీవల స్వగ్రామానికి వచ్చాడు. ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో ఇంటి నుంచి తమ కూల్ డ్రింక్ షాపు వద్దకు సైకిల్‌లో బయలుదేరిన మదన్‌సాయి కింద పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. కుటుంబ సభ్యులు వెంటనే వాహనంలో కర్నూలు ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ రాత్రి 11 గంటల సమయంలో మృతి చెందాడు. కుమారుడి అకాల మృతితో కుటుంబ సభ్యులు శోక సంద్రంలో మునిగి పోయారు.

- గత నెలలో అనంతపురం రూరల్ మండలానికి చెందిన 30 ఏళ్ల యువకుడు గుండె నొప్పిగా ఉందంటూ అనంతపురంలోని సర్వజనాస్పత్రికి వచ్చాడు. వైద్యులు పరీక్షిస్తున్న సమయంలోనే కుప్పకూలి ప్రాణాలు వదిలాడు.
- అనంతపురం నగరపాలక సంస్థలో పని చేసే ఓ ఉద్యోగి ఇటీవల అమరావతికి వెళ్లారు. మార్గ మధ్యంలో ఉన్నఫళంగా గుండె నొప్పి వచ్చింది. తోటి సిబ్బంది హుటాహుటిన కర్నూలు జిల్లాలోని ఓ ఆస్పత్రిలో చేర్పించగా అదృష్టవశాత్తు ప్రాణాలతో బయటపడ్డాడు. వీరిద్దరే కాదు.. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఇటీవల యువతలో గుండెపోట్లు పెరిగిపోయాయి.



బీ'ట్' కేర్ ఫుల్

- యువతలో అధికమైన గుండె సమస్యలు
- ఆహార అలవాట్లు, వ్యసనాలతోనే సమస్యలంటున్న వైద్య నిపుణులు
- మెరుగైన జీవన విధానంపై దృష్టి సారించాలని సూచనలు

అనంతపురం మెడికల్: నిండు నూరేళ్లు జీవించాలని పెద్దలు ఆశీర్వదిస్తుంటారు. వందేళ్లు ఎటువంటి అనారోగ్య సమస్యలు లేకుండా ఆనందంగా జీవనం సాగించాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. కానీ ప్రస్తుత రోజుల్లో వందేళ్ల మాట పక్కన పెడితే 25 నుంచి 30 ఏళ్లకే యువత మరణిస్తుండడం కలచివేస్తోంది. ప్రధానంగా గుండె సంబంధిత సమస్యలతో ప్రాణాలో కోల్పోతుండడం కలవరపరుస్తోంది. చెట్టంత కొడుకు కళ్లముందే ప్రాణాలు విడుస్తుండడంతో తల్లిదండ్రులకు తీరని శోకం మిగులుతోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఏటా సగటున 25 వేల మందికిపైగా గుండెపోట్లకు గురవుతుండడం గమనార్హం. 2019–20లో 4,660, 2020–21లో 5,107, 2021–22లో 6,637, 2022–23లో 7,909, 2023–24లో 10,274, 2024–25లో 9,754, 2025లో 7 వేల వరకు (ఇప్పటి వరకు) గుండె సంబంధిత శస్త్రచికిత్సలు జరిగాయి.ఏటా ఎన్‌టీఆర్ వైద్య సేవ పథకం (ఆరోగ్య శ్రీ)లో భాగంగా 30 శాతానికి పైగా గుండె జబ్బులకే వ్యయమవుతోంది. రూ.25 కోట్లకు పైగానే ప్రభుత్వం ఖర్చు చేస్తోంది.

జాగ్రత్తలు తప్పనిసరి..

విద్యార్థి దశ నుంచే జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ప్రధానంగా రోజూ కనీసం అరగంట వాకింగ్, వ్యాయామం చేయాలంటున్నారు. ఆహారంపై కూడా శ్రద్ధ వహించాలని చెబుతున్నారు. జంక్ ఫుడ్‌తో ఒబెసిటీ, గ్యాస్ట్రైటీస్ తదితర సమస్యలు తలెత్తుతాయంటున్నారు. వారానికి 150 నిమిషాలు కనీస నడక మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. అలాగే, 40 ఏళ్లు పైబడిన వారు తప్పకుండా బీపీ, కొలెస్ట్రాల్, షుగర్, టెస్టులు చేయించుకుని మందులు వాడితే గుండెపోటును నియంత్రించవచ్చంటున్నారు.



వ్యసనాలతోనే సమస్య..

వ్యసనాలకు బానిసలు కావడం,వ్యాయామం, యోగా తదితర వాటికి దూరంగా ఉండడం తదితర కారణాలతో చిన్నవయసులోనే గుండె సమస్యలు తలెత్తుతాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుత రోజుల్లో యువత పార్టీల పేరుతో ఇష్టానుసారంగా మద్యం తీసుకుంటున్నారు. అత్యంత ప్రమాదకరమైన ధూమపానాన్ని సేవిస్తున్నారు. దీనికి తోడు ఉరుకుల పరుగుల జీవితంలో బిజీగా ఉంటూ మానసిక ఒత్తిడికి లోనవుతూ హైపర్‌టెన్షన్, మధుమేహం బారిన పడుతున్నారు.

యోగాతో సత్ఫలితాలు



ప్రస్తుత పోటీ ప్రపంచంలో మంచి ఆహార అలవాట్లు లేకపోవడం, శారీరక శ్రమ చేయకపోవడం, నిద్రలేమి తదితర కారణాలతో తీవ్రమైన మానసిక ఒత్తిళ్లకు లోనవుతున్నారు. గుండె పోటు, బీపీ, మధుమేహం తదితర సమస్యలు తెచ్చుకుంటున్నారు. ప్రతి ఒక్కరూ విధిగా వ్యాయామం చేయాలి. యోగా బాగా ఉపయోగపడుతుంది. నిత్యం యోగా చేస్తే సత్ఫలితాలు పొందవచ్చు.

– సురేష్ ఈశాపతి, యోగా గురువు, అనంతపురం

వైద్య పరీక్షలు చేయించుకోవాలి



జంక్ ఫుడ్, పొగ తాగడం, వ్యాయామం లేకపోవడంతో యువత మానసిక ఒత్తిడికి లోనవుతున్నారు. వారంలో కనీసం ఐదు రోజుల పాటు వ్యాయామం చేయాలి. వంశపారంపర్యంగా కూడా గుండె సమస్యలు వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుత రోజుల్లో 12 మందిని పరీక్షిస్తే అందులో ముగ్గురికి కచ్చితంగా బీపీ సమస్య కన్పిస్తోంది.ఈ పరిస్థితుల్లో 40 ఏళ్లు దాటిన వారందరూ తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలి.

– సుభాష్ చంద్రబోస్, అసోసియేట్ ప్రొఫెసర్, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి

పెండింగ్ మాట వినిపించొద్దు

- అధికారులకు కలెక్టర్ ఆనంద్ స్పష్టమైన ఆదేశాలు



అనంతపురం అర్బన్: ''నిర్దేశించిన అంశాలకు సంబంధించిన పనులు సకాలంలో పూర్తి కావాలి. ఏ అంశంలోనూ పెండింగ్ మాట వినిపించ కూడదు''అని కలెక్టర్ ఓ.ఆనంద్ సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలిచ్చారు. చుక్కల భూముల ఫైళ్ల పరిష్కారం, ఉద్యోగులకు ఏడాదిన్నరగా పదోన్నతుల కల్పనలో జరుగుతున్న జాప్యంపై 'సాక్షి'లో ఈనెల 17న, 21వ తేదీన ''సారూ... దృష్టి సారించండి'', ''కొత్తసారుపై.. కొండంత ఆశ'' శీర్షికన ప్రచురితమైన కథనాలపై కలెక్టర్ స్పందించారు. పరిష్కారానికి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు. అందులో భాగంగా సంబంధిత విభాగాల అధికారులు, సిబ్బందితో ఆయన రెండు రోజులుగా ప్రత్యేకంగా సమావేశమై తగిన సూచనలు, సలహాలు, ఆదేశాలు ఇచ్చారు.

ఆదేశాలు ఇలా..

- 22ఏ (నిషేధిత భూములు) జాబితాలోని భూములకు సంబంధించిన ఫైళ్లను పరిష్కరించాలి. చెక్‌లిస్ట్ ప్రకారం ఫైలును పక్కాగా సిద్ధం చూసి ఆమోదం కోసం ఉంచాలి. తిరస్కరణకు గురయ్యే వాటిని ఉంచకూడదు. 22ఏ ప్రత్యేక డ్రైవ్ కింద మొదటి విడతగా 487 ఫైళ్లు పరిశీలించి క్లియర్ చేయాలి. 10 రోజుల తర్వాత రెండో విడత చేపట్టి 500 ఫైళ్లు క్లియర్ చేయాలి. 22ఏ జాబితా నుంచి భూమి తొలగించాలంటూ పరిష్కార వేదికలో ఇక నుంచి ఫిర్యాదులు రాకూడదు.
- నిబంధనల ప్రకారం ఉన్న డాటెడ్ ల్యాండ్ (చుక్కల భూములు) ఫైళ్లు క్లియర్ చేయాలి. చెక్‌లిస్ట్ ప్రకారం ఫైళ్లను సిద్ధం చేసి ఆమోదం కోసం ఉంచాలి. ఏ దశలోనూ నిర్లక్ష్యం, అవినీతికి తావివ్వకూడదు. చిన్నపాటి ఫిర్యాదు కూడా రాకూడదు.
- కారుణ్య నియామకాల విషయంలో నిర్లక్ష్యం సరికాదు. ఎప్పటికప్పుడు ఫైళ్లను ఉంచాలి. నెల రోజుల వ్యవధిలో కారుణ్య నియామకాలు కల్పించాలి. ఇందుకు సంబంధించిన ఫైళ్లను ఆమోదం కోసం ఉంచండి.
- ఉద్యోగులకు పదోన్నతులు కల్పించే విషయంలో జాప్యం చేయకూడదు. ఇందుకు సంబంధించిన ఫైళ్లను సిద్ధం చేసి ఆమోదం కోసం ఉంచండి. ప్రతీదీ నిర్ణీత సమయంలో పూర్తి చేయాలి.

డిజిటల్ బుక్‌తో శ్రేణులకు భరోసా

- చంద్రబాబు ఆధ్వర్యంలో అరాచక పాలన
- పోలీసులపై హైకోర్టు తీవ్ర స్పందన ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిది
- రెడ్ బుక్ రాజ్యాంగం నుంచి కార్యకర్తలను కాపాడుకుంటాం
- వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి



వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి డిజిటల్ బుక్ స్కానర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

ఉరవకొండ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు కూటమి ప్రభుత్వంలో కష్టాలు పడుతున్న ప్రజలకు భరోసా కల్పించేందుకే మాజీ సీఎం, పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్‌ను ఆవిష్కరించారని పార్టీ పీఏసీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. ఆదివారం అనంతపురంలోని మాజీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో డిజిటల్ బుక్ స్కానర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విశ్వ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ఇబ్బంది పడుతున్న ప్రతి ఒక్కరినీ కాపాడుకుంటామన్నారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలను పోలీసుల ద్వారా అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఎటు చూసినా అక్రమ నిర్బంధాలు, అరెస్టులు జరుగుతున్నాయన్నారు. సోషల్ మీడియాలో కామెంట్లు పెట్టినా కేసుల పేరుతో వేధిస్తున్నారని, ఆఖరుకు మీడియా స్వేచ్ఛను హరించే విధంగా దుర్మార్గపు పాలన సాగుతోందని దుయ్యబట్టారు. హైకోర్టు అనేక సార్లు చీవాట్లు పెట్టినా చంద్రబాబు ప్రభుత్వానికి బుద్ధి రావడం లేదన్నారు. ఇటీవల పోలీసుల తీరును ఆక్షేపిస్తూ స్వయంగా హైకోర్టు ఒక కేసును సీబీఐకు అప్పగించడం ఈ ప్రభుత్వానికి చెంపపెట్టు వంటిదన్నారు. మాజీ సీఎం జగన్‌పై అసెంబ్లీలో ఎమ్మెల్యే బాలకృష్ణతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు చేసిన వ్యాఖ్యలను విశ్వ ఖండించారు. గతంలో సినీ నటుడు చిరంజీవి అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వద్దకు వెళ్లినప్పుడు ఎంతో హుందాగా వ్యవహరించారని గుర్తు చేశారు. పార్టీ అధినేతను, కార్యకర్తలను అవమానిస్తున్న ఏ ఒక్కరినీ వదిలిపెట్టేది లేదని, తమ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే చట్టప్రకారం అందరినీ శిక్షిస్తామని పునరుద్ఘాటించారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు డిజిటల్ బుక్‌ను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి సీపీ వీరన్న, విద్యార్థి, యువజన విభాగం నాయకులు పాల్గొన్నారు.

'లక్ష'ణంగా నొక్కేస్తున్నారు!

- రైతు రామప్పకు కొడిమి వద్ద పొలం ఉంది. ఇటీవల 1–బీ పత్రం కోసం నగరంలోని ఓ మీ–సేవ కేంద్రానికి వెళ్లాడు. ప్రభుత్వం నిర్ధారించిన రుసుం రూ.40 అయితే నిర్వాహకులు రూ.50 తీసుకున్నారు. అందరి వద్ద ఇలా అదనంగా వసూలు చేస్తున్నారు.
- శంకరమ్మ అనే మహిళా రైతు నగరంలో నివాసముంటోంది. ఆమెకు కళ్యాణదుర్గం మండల పరిధిలో పొలం ఉంది. ఇటీవల 1–బీ, అడంగల్ కోసం కళ్యాణదుర్గంలోని మీ–సేవ సెంటర్‌కి వెళ్లింది. ప్రభుత్వం నిర్ధారించిన ధర ప్రకారం 1–బీకి రూ.40, అడంగల్‌కి రూ.40 తీసుకోవాల్సి ఉండగా, ఒక్కో పత్రంపై అదనంగా రూ.10 చొప్పున రెండు పత్రాలకు రూ.100 వసూలు చేశారు. జిల్లావ్యాప్తంగా ఇదే తంతు కొనసాగుతోంది. 'మీ సేవ' నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వసూళ్లు చేస్తున్నా ఎవరికీ పట్టడం లేదు.



జిల్లాలో	
మీ- సేవ కేంద్రాలు	290
ప్రస్తుతం పనిచేస్తున్నవి	177
1బి పత్రానికి రుసుం	రూ.40
అడంగళ్ పత్రానికి రుసుం	రూ.40
ఒక్కో పత్రానికి ప్రభుత్వం ఇచ్చేది	రూ.15
రోజువారీ జారీ అయ్యే పత్రాలు	10 వేలు
ఒక్కొక్కదానిపై అదనపు వసూలు	రూ.10
ఒక్క రోజు అదనపు ఆదాయం	రూ.1 లక్ష
నెలకు అదనపు ఆర్జన	రూ.30 లక్షలు
ఇక కమీషన్ రూపంలో అందేది	రూ.45 లక్షలు

- మీ'సేవ'ల్లో ఇష్టారాజ్యంగా వసూళ్లు
- 1–బీ, అడంగల్‌పై రూ.10 బాదుడు

అనంతపురం అర్బన్: 'మీ–సేవ' కేంద్రాల్లో అదనపు నొక్కుడు బహిరంగంగా సాగుతోంది. జిల్లాలో 290 మీ–సేవ కేంద్రాలు ఉండగా ప్రస్తుతం 177 పనిచేస్తున్నాయి. ఆయా కేంద్రాల్లో 1బీ, అడంగల్‌కు నిర్దేశించిన రుసుంపై అధికంగా వసూలు చేస్తున్నారు. ప్రతి పత్రంపై రూ.10 అదనంగా లాగుతున్నారు. చూసేందుకు రూ.10 అనేది చిన్న మొత్తంగా కనిపిస్తుంది. అలా కనీసంగా రోజుకు ఒక కేంద్రంలో 500 పత్రాలు జారీ చేసినా అదనపు వసూలు మొత్తం రూ.5 వేలు కావడం గమనార్హం. జిల్లావ్యాప్తంగా రోజూ దాదాపు 10 వేల వరకు పత్రాలు జారీ అవుతుంటాయి. ఒక్కో పత్రంపై అదనంగా రూ.10 అంటే నిత్యం అదనపు ఆదాయం రూ.లక్ష కాగా నెలసరి రూ.30 లక్షల మేర ఉంటోంది. 1–బీ లేదా అండగల్‌కు రైతు చెల్లించే రూ.40లో ప్రభుత్వం మీ సేవ నిర్వాహకునికి రూ.15 చెల్లిస్తున్న నేపథ్యంలో ప్రతి నెలా రూ.3.75 లక్షల అ'ధనం' పొందుతుండడం గమనార్హం.

కావాలంటే తీసుకో.. లేకుంటే వెళ్లిపో

జిల్లాలో ఏడు లక్షల మందికి పైగా రైతులు ఉన్నారు. బ్యాంకు నుంచి రుణం తీసుకోవాలంటే తప్పని సరిగా 1–బీ పత్రం సమర్పించాలి. వీటిని మీ–సేవ ద్వారానే పొందాల్సి ఉంటుంది. ఇదే నిర్వాహకులకు అవకాశంగా మారింది. ఇదేమని ప్రశ్నిస్తే 'అదంతే కావాలంటే తీసుకో లేదంటే వెళ్లు' అంటూ కరాఖండీగా చెబుతున్నారు. సేవలకు సంబంధించి ధరల పట్టిక ఏ కేంద్రంలోనూ కనిపించడం లేదు.

తనిఖీల్లేవ్..

మీ–సేవ కేంద్రాలపై సంబంధిత అధికారులు కనీస తనిఖీలు చేపట్టడం లేదు. నిబంధనలు పాటించని కేంద్రాలపై చర్యలే లేవు. అధికారుల పర్యవేక్షణ, తనిఖీలు లేకపోవడంతో కొన్ని కేంద్రాల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్నట్లు తెలిసింది.

టమాట రైతుకు ధరాఘాతం

- భారీగా ధరల పతనం
- పెట్టుబడులూ తిరిగిరావడం లేదు



పంపనూరు అటవీ ప్రాంతంలో రోడ్డు పక్కన పడేసిన టమాటాలు

ఆత్మకూరు: టమాట ధరలు రైతులను ఊరించి.. ఉసూరుమనిపిస్తున్నాయి. ధర ఆశాజనకంగా ఉంటుందన్న ఉద్దేశంతో రైతులు టమాట సాగు చేశారు. ప్రారంభంలో మంచి ధర లభించినప్పటికీ.. ఇప్పుడు ఉన్నఫళంగా తగ్గిపోయాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో కళ్యాణదుర్గం, మడకశిర, శెట్టూరు, బ్రహ్మసముద్రం, కంబదూరు, ఆత్మకూరు, రాప్తాడు, కదిరి మండలాల్లో ఎక్కువగా టమాట సాగు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 18 వేల హెక్టార్ల విస్తీర్ణంలో పంట సాగైంది. నారు, మందులు, ఎరువులు, కూలీల ఖర్చు ఎకరాకు రూ.50 వేల వరకు వెచ్చించారు. ఇక కట్టెలు పాతి పందిరి వేస్తే ఎకరాకు మరో రూ.30వేల దాకా అదనం. అంత శ్రమించి పంట సాగు చేసిన రైతులు ప్రస్తుతం మార్కెట్లో ధరలు చూసి షాక్ అవుతున్నారు.

రోడ్డుపాలు..

మార్కెట్‌లో టమాట ధరలు పూర్తిగా పడిపోయాయి. 15 కిలోల టమాట బాక్సు ధర రూ.20 నుంచి రూ.150 మించడం లేదు. ఈ ధరలు కేవలం మొదట్లో రెండు కటింగులు మాత్రమే అమ్ముడుపోతున్నాయని, కొంచెం కాయల పరిమాణంలో తేడా ఉన్నా, మచ్చలు ఉన్నా 'నో సేల్' అంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో చాలామంది మార్కెట్‌లో అమ్ముడుపోని టమాటలను రోడ్డు పక్కన పడేస్తున్నారు. గిట్టుబాటు ధర లేక విలవిలలాడుతున్న రైతులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి చేయూత అందలేదు. సాగు చేసిన టమాట పంటకు వర్షాల వల్ల మచ్చలు రావడంతో పూర్తిగా నష్టం వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని కోరుతున్నారు.

నష్టం వస్తోంది



టమాట రైతులు ప్రస్తుతం నష్టాలు చవిచూస్తున్నారు. పెట్టిన పెట్టుబడి కూడా చేతికి అందలేదు. ధరలు వస్తాయన్న ఆశతో టమాట సాగు చేశాం. కూలీలకు కూడా అందడం లేదు. రైతులకు నష్టపరిహారం అందేలా చూడాలి. – నారపరెడ్డి, రైతు, పంపనూరు, ఆత్మకూరు మండలం

'ధన'లక్ష్మీ నమోస్తుతే

శరన్నవరాత్రి ఉత్సవాలు జిల్లావ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. అమ్మవారి ఆలయాలకు భక్తులు పోటెత్తుతున్నారు. ఏడో రోజైన ఆదివారం జగన్మాత వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాయదుర్గంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని రూ. కోటి విలువైన కరెన్సీ నోట్లు, కాయిన్లతో అలంకరించడం విశేషంగా ఆకట్టుకుంది. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తాయి రాజశేఖర్, యువజన సంఘం అధ్యక్షుడు వంశీకృష్ణ, ప్రధాన అర్చకులు వెంకటాచలశర్మ అలంకరణలో పాలుపంచుకోగా, భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

– రాయదుర్గంటౌన్



క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్



మొక్కలు నాటుతున్న మంత్రి సత్యకుమార్

అనంతపురం రూరల్: ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణను బాధ్యత తీసుకుని మొక్కల పెంపకాన్ని విస్తృతంగా చేపట్టాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ పిలుపునిచ్చారు. 'నమో వనం – ఏక్‌పేడ్ మాకే నామ్' కార్యక్రమంలో భాగంగా ఆదివారం సీఆర్ఐటీ కళాశాలలో ఆయన మొక్కలు నాటి, మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సందిరెడ్డి శ్రీనివాసరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్, నాయకులు చిరంజీవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో ద్విచక్ర వాహనాల దొంగ

గుత్తి: ద్విచక్ర వాహనాలను అపహరించుకెళుతున్న ఓ యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాగా, గత ఆరు మాసాలుగా గుత్తి మున్సిపాలిటీ పరిధిలో పలు ద్విచక్ర వాహనాలు అపహరణకు గురయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసిన పోలీసులు.. దర్యాప్తును ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఈ క్రమంలో శనివారం రాత్రి అనుమానాస్పదంగా తచ్చాడుతున్న గాజులపల్లికి చెందిన ఓ యువకుడిని సీఐ నాగరాజు, ఎస్ఐలు సురేష్, గౌతం అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేపట్టారు. ఒకట్రెండు రోజుల్లో నిందితుడిని అరెస్ట్ చూపనున్నట్లు సమాచారం.

ముందస్తు టీకానే శరణ్యం

- పశుశాఖ జేడీ ప్రేమ్‌చంద్



కుక్కకు రేబిస్ టీకా వేస్తున్న డాక్టర్ ప్రేమ్‌చంద్

అనంతపురం అగ్రికల్చర్: రేబీస్ సోకితే చికిత్సకు నయమయ్యే అవకాశం తక్కువగా ఉన్నందున ముందస్తు టీకాలు, ఇతర జాగ్రత్తలే శరణ్యమని పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ జి.ప్రేమ్‌చంద్ అన్నారు. ప్రపంచ రేబీస్ దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక సాయినగర్‌లో ఉన్న పశువ్యాధి నిర్ధారణ కేంద్రం, వెటర్నరీ ఆస్పత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో కుక్కలకు రేబీస్ టీకాలు వేసి, జేడీ మాట్లాడారు. కుక్క కాటు వేస్తే వైరస్ శరీరంలో ప్రవేశించి కండరాలలో వైరస్ వృద్ధి చెంది నాడీ వ్యవస్థ ద్వారా ఇతర భాగాలకు చేరి ప్రాణాంతకంగా మారుతుందని తెలిపారు. చికిత్స కన్నా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. క్రమం తప్పకుండా పెంపుడు, వీధి కుక్కలకు ముందస్తుగా టీకాలు వేయించాలని తెలిపారు. కుక్క కాటుకు గురైతే పారే నీటి కొళాయి కింద కార్బలిక్ సబ్బు లేదా డెట్టాల్ సబ్బుతో 10 నుంచి 15 సార్లు బాగా నురగ వచ్చేలా కడుక్కోవాలన్నారు. గాయం మీద ఐస్ ముక్కలు ఉంచడం వల్ల కొంత మేలు జరుగుతుందని, అనంతరం వైద్యుల పర్యవేక్షణలో చిక్సి పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీడీఎల్ ఏడీ డాక్టర్ జి.రవిబాబు, ఆసుపత్రి ఏడీ డాక్టర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కొలిస్తే చింతలన్నీ దూరం

- రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు
- 7న బ్రహ్మరథోత్సవం

భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్న చింతల వేంకటరమణస్వామి



ఆలయంలోని లోపలి భాగం, (ఇన్‌సెట్) భూదేవి, శ్రీదేవి సమేత చింతల వేంకటరమణస్వామి ఉత్సవ విగ్రహాలు

తాడిపత్రి రూరల్: కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా విరాజిల్లుతున్న తాడిపత్రిలోని భూదేవి, శ్రీదేవి సమేత చింతల వేంకటరమణస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 30న ప్రారంభం కానున్నాయి. ఏటా ఆశ్వయుజ మాసం శుద్ధ అష్టమి నుంచి బహుళ విదియ వరకు శ్రీవారి బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకు ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించే పనులు ఊపందుకున్నాయి.

బ్రహ్మోత్సవాలు ఇలా..

30న మంగళవారం సాయంత్రం విష్వక్సేనారాధన, మృత్సంగ్రహణం, అంకురార్పణ, అక్టోబరు 1న శేషవాహనం, 2న సింహవాహనం, మధ్యాహ్నం శమీ వృక్ష దర్శనం రాత్రి హంసవాహనం, 3న ఉదయం సూర్యప్రభ వాహనం, సాయంత్రం చంద్రప్రభ వాహనం, 4న ఉదయం మోహినిదేవి అలంకరణ, రాత్రి గరుడ వాహనం, 5న ఉదయం తిరుచ్చిలో ఉత్సవం, సాయంత్రం హనుమద్ వాహనం, 6న ఉదయం సర్వభూపాల వాహనం, సాయంత్రం గజవాహనం, 7న ఉదయం తిరుకల్యాణం, మధ్యాహ్నం విందుభోజనాలు, మధ్యాహ్నం 2.45గంటలకు బ్రహ్మరథోత్సవం, 8న ఉదయం తిరుచ్చిలో ఉత్సవం, సాయంత్రం అశ్వవాహనం, 9న వసంతోత్సవం, చక్రస్నానం, సాయంత్రం ద్వాదశ అరాధన, రాత్రి ధ్వజా అవరోహణ, కుంభ ప్రోక్షణ, భట్టర్ మర్యాద నిర్వహించనున్నారు.

శిల్పకళతో అబ్బుర పరుస్తున్న ఆలయం..

భూదేవి, శ్రీదేవి సమేత చింతల వేంకటరమణస్వామి ఆలయంలో అరుదైన శిల్ప కళాసంపదను సొంతం చేసుకుంది. క్రీ.శ. 1490–1520 మధ్య కాలంలో విజయనగర సామ్రాజ్యంలో మండలాధీశునిగా పనిచేస్తున్న తిమ్మనాయుడు ఈ ఆలయాన్ని నిర్మించినట్లుగా ఇక్కడి శాసనాల ద్వారా తెలుస్తోంది. శిల్ప కళాశోభితమైన మంటపాలు, మహాద్వార గోపురాలను అద్భుతంగా నిర్మించారు. ప్రధాన ద్వారం, గాలిగోపురం తూర్పు దిశలో ఉన్నాయి. గాలిగోపురానికి ముందు రాతితో నిర్మించిన ఊయాల మంటపం, ఎత్తైన దీపపు స్తంభం ఉన్నాయి. హంపీలోని శిల్ప కళకు దగ్గర పోలికతో ఉన్న ఈ ఆలయాన్ని వారణాశి నుంచి ప్రత్యేకంగా రప్పించిన శిల్పులతో నిర్మించినట్లుగా చరిత్రకారులు చెతున్నారు. ఆలయంలో ఏకశిలారథంతో పాటు రామాణ, మహాభారత, భాగవతం విశిష్టను చాటే శిల్పాలు అబ్బుర పరుస్తున్నాయి. కళ్యాణమంటపంలోని లో స్థంభంలో మూడు దీపపు స్తంభాలను మీటితే సప్తస్వరాలు పలుకుతాయి. గర్భగుడిపై భాగంలో ఏర్పాటు చేసిన రాతిపద్మం నాటి శిల్ప కళానైపుణ్యానికి అద్దం పడుతోంది. మొత్తం 40 రాతి స్తంభాలతో మహా మంటపాన్ని ఏర్పాటు చేశారు. ఆలయంలోని విశాల ప్రాంగణంలో మహాలక్ష్మి ఆలయం, కల్యాణమంటపం, చెన్నకేశవ స్వామి ఆలయం, లక్ష్మీ సమేత వరాహస్వామి, ఆంజినేయ స్వామి, లక్ష్మీనారాయణ, రామాంజినేయ, రామానుజార్యుల ఉప ఆలయాలు ఉన్నాయి.

అరాచకాలకు 'డిజిటల్ బుక్'తో చెక్



క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే వైవీఆర్, తదితరులు

- డిజిటల్ బుక్ ఆవిష్కరణలో మాజీ ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లు టౌన్: అధికారమదంతో విర్రవీగుతున్న కూటమి పార్టీ నేతలు, కార్యకర్తలకు బుద్ధిచెప్పేందుకే వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి డిజిటల్ బుక్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారని గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే, పార్టీ సమన్వయకర్త వై.వెంకటరామిరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ స్కానర్ పోస్టర్లను ఆవిష్కరించి, మాట్లాడారు. రెడ్‌బుక్ పేరిట కూటమి నేతలు, కొంత మంది పోలీసు అధికారులు వైఎస్సార్‌సీపీ శ్రేణులు, సోషియల్ మీడియా యాక్టివిస్టులను వేధిస్తున్నారన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే హింసా రాజకీయాలకు పాల్పడిన నేతలతో పాటు అక్రమ కేసులు బనాయించిన అధికారులందరినీ చట్టం ముందు దోషులుగా నిలబెట్టి, న్యాయపోరాటం సాగిస్తామన్నారు. అన్యాయానికి గురైన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు డిజిటల్ బుక్ భరోసా లాంటిదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని, వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు ఖలీల్, రాము, కౌన్సిలర్లు నీలావతి, కుమారి, చాంద్‌బాషా, సుమోబాషా, లింగన్న, ఎంపీటీసీలు హనుమంతు, సర్పంచులు నారాయణస్వామి, నాగార్జున, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు వీరేష్, కొంగనపల్లి, అంజి, పవన్, బాసిద్, బాబూరావు, వార్డు ఇన్‌ఛార్జులు దర్గానాయుడు, ఎల్లప్ప, సీనియర్ నాయకులు మల్లికార్జున శాస్త్రి, ఫ్లయింగ్‌మాబు, నూర్‌నిజామి, ఎంఎం.రెహమాన్, నల్లప్ప, నాయకులు జయన్న, తిక్కస్వామి, గోవింద్‌నాయక్, జయరామిరెడ్డి, రామాంజి, సోమిరెడ్డి, వెంకటేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అధికారం శాశ్వతం కాదు..

అధికారం శాశ్వతం కాదనే విషయాన్ని తెలుసుకుని ఇప్పటికైనా అధికార మదాన్ని వీడాలని హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణకు మాజీ ఎమ్మెల్యే వైవీఆర్ హితవు పలికారు. స్వయంకృషితో మెగాస్టార్‌గా ఎదిగిన చిరంజీవి అసెంబ్లీ వేదికగా బాలకృష్ణ హేళనగా మాట్లాడినా.. సొంత తమ్ముడు, డిప్యూటీ సీఎం పవన్ స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. అసెంబ్లీలో ఏమీ మాట్లాడకపోయినా తన కుటుంబసభ్యులను దూషించారని బోరున విలపించిన చంద్రబాబు.. సాక్షాత్తూ జూనియర్ ఎన్టీఆర్ మాతృమూర్తిని అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అసభ్యకరంగా దూషించినా ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు.

ఎస్‌బీఐ విశ్రాంత మేనేజర్ ఇంట్లో చోరీ

గుంతకల్లు టౌన్: స్థానిక తిలక్‌నగర్‌లో నివాసముంటున్న ఎస్‌బీఐ విశ్రాంత మేనేజర్ అరికేరి శ్రీనాథ్ ఇంట్లో చోరీ జరిగింది. గుత్తి మాజీ ఎమ్మెల్యే అరికేరి జగదీష్ సోదరుడు అరికేరి శ్రీనాథ్ తన కుటుంబ సభ్యులతో కలసి ఈ నెల 19న బెంగుళూరుకు, తర్వాత అక్కడి నుంచి కాశీ యాత్రకు వెళ్లారు. తాళం వేసిన ఇంటిని గుర్తించిన దుండగులు ఆదివారం వేకువజామున బద్ధలుగొట్టి లోపలకు ప్రవేశించారు. ఆ సమయంలో ఇంట్లోని శబ్దాలు కావడంతో నిద్ర మేల్కొన్న ఎదురింటిలోని వ్యక్తిగా గట్టిగా కేకలు వేయడంతో దుండగులు పారిపోయారు. విషయాన్ని పోలీసుల ద్వారా శ్రీనాథ్‌కు స్థానికులు చేరవేయడంతో అప్పటికే కాశీ యాత్ర ముగించుకుని బెంగళూరుకు చేరుకున్న శ్రీనాథ్ కుటుంబసభ్యులు వెంటనే ఇంటికి చేరుకుని పరిశీలించారు. బీరువాను ధ్వంసం చేసి బంగారు ఆభరణాలను అపహరించినట్లుగా నిర్ధారించుకున్నారు. కాగా, చోరీ సమయంలో ఓ దుండగుడి టవాల్ అక్కడే పడిపోయింది. వేలిముద్రల నిపుణులు రంగంలో దిగి ఆధారాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ మస్తాన్ తెలిపారు.



శ్రీనాథ్ ఇంట్లో బీరువాలోని సామగ్రిని చెల్లాచెదురు చేసిన దృశ్యం

ప్రొఫెషనల్ దొంగల పనే..

బ్యాంక్ విశ్రాంత మేనేజర్, బెస్తకాలనీలో వంట మాస్టర్ ఇంట్లో చోరీకి పాల్పడింది ప్రొఫెషనల్ దొంగలేనని పోలీసులు అనుమానిస్తున్నారు. తొలుత బెస్త కాలనీలో దొంగతనానికి పాల్పడిన వారు వచ్చిన హోండా షైన్ ద్విచక్రవాహనాన్ని సంజీవనగర్‌లోని ఓ ఇంటి వద్ద వదిలి కేపీఎస్ థియేటర్‌లో ఆపరేటర్‌గా పనిచేస్తున్న లోకేష్ ద్విచక్రవాహనాన్ని అపహరించి తిలక్‌నగర్‌లోని బ్యాంక్ మేనేజర్ ఇంటి వద్ద వదిలి వెళ్లారు. రెండు ద్విచక్రవాహనాలు పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది.

వంట మాస్టర్ ఇంట్లో ..

స్థానిక బెస్త కాలనీలో నివాసముంటున్న రూప్‌సాగర్ ఇంట్లో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు శుభకార్యాల్లో వంట పనిచేస్తూ జీవనం సాగిస్తున్న రూప్‌సాగర్ ఈ నెల 20న ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలసి కర్ణాటకలోని హొళ్లి, హోసపేట ప్రాంతాల్లో జరిగిన వివాహ వేడుకల్లో వంట చేయడానికి వెళ్లాడు. గుర్తించిన దుండగులు తాళాలు బద్దలుగొట్టి లోపలకు ప్రవేశించారు. బీరువాలోని 4 తులాల బంగారు ఆభరణాలు, రూ.2 లక్షల నగదును అపహరించారు. ఇంటి తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించిన స్థానికుల నుంచి సమాచారం అందుకున్న రూప్‌సాగర్ కుటుంబసభ్యులు ఆదివారం ఉదయం ఇంటికి చేరుకుని చోరీ జరిగినట్లుగా నిర్ధారించుకుని సమాచారం ఇవ్వడంతో కసాపురం పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

లైన్‌మెన్‌కు విద్యుత్ షాక్

- పరిస్థితి విషమం.. బళ్లారికి తరలింపు



అపస్మారక స్థితిలో పడిపోయిన లైన్‌మెన్ రామాంజినేయులు

బొమ్మనహాళ్: విద్యుత్ షాక్‌తో గ్రేడ్–2 జూనియర్ లైన్‌మాన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన బొమ్మనహాళ్ మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. బొమ్మనహాళ్ విద్యుత్ కార్యాలయంలో గ్రేడ్–2 జూనియర్ లైన్‌మాన్‌గా రామాంజినేయులు విధులు నిర్వహిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన రైతు వెంకటేశులు తన పొలంలో 11 కేవీ విద్యుత్ లైన్ హెడ్ ఫ్యూజు పోయిందని తెలపడంతో ఆదివారం ఉదయం మరమ్మతు చేసేందుకు రామాంజనేయులు వెళ్లాడు. కురువల్లి బొమ్మనహాళ్ ఫీడర్ లైన్ కింద ఉన్న ఈ లైన్‌కు స్థానిక సబ్‌స్టేషన్ నుంచి ఎల్‌సీ తీసుకుని, ఫ్యూజు వేస్తుండగా ఒక్కసారిగా విద్యుత్ సరఫరా జరిగి షాక్‌కు గురై పై నుంచి కిందకు పడి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన రైతులు వెంటనే ఓ ప్రైవేట్ అంబులెన్స్‌లో బళ్లారిలోని విమ్స్‌కు తరలించారు. రెండు చేతులు, ఓ కాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. పరిస్థితి విషమంగా ఉన్నట్లు విమ్స్ వైద్యులు తెలిపారు సమాచారం అందుకున్న రాయదుర్గం ఏడీఏ శ్రీనివాసనాయుడు, బొమ్మనహాళ్ ఏఈఈ లక్ష్మీరెడ్డి బళ్లారికి చేరుకుని క్షతగాత్రుడిని పరామర్శించారు. ఆపరేటర్ తప్పిదమే కారణమనే అనుమానాలు ఉన్నాయని, దీనిపై లోతైన విచారణ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

ఉద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

- 'ఆల్‌మేవా' ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు షెక్షావలి



మాట్లాడుతున్న షెక్షావలి

అనంతపురం ఎడ్యుకేషన్: ఎన్నికలకు ముందు ఉద్యోగులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని కూటమి ప్రభుత్వాన్ని ఆల్ మైనార్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఆల్ మేవా) ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు షెక్షావలి డిమాండ్ చేశారు. ఆల్‌మేవా రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ వై.ఫక్రుద్దీన్ అధ్యక్షతన ఆదివారం అనంతపురంలోని లిటిల్‌ఫ్లవర్ స్కూల్‌లో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 16 నెలలుగా ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ఇప్పటి వరకూ 12వ పీఆర్సీ ఏర్పాటు చేయకపోవడం అన్యాయమన్నారు. పెండింగ్‌లో ఉన్న 4 డీఏలను వెంటనే విడుదల చేయాలని, 30 శాతం మధ్యంతర భృతి మంజూరు చేయాలన్నారు. జిల్లా ప్రధానకార్యదర్శి ఫారూక్ మహమ్మద్ మాట్లాడుతూ.. మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లుల మంజూరులో జాప్యం జరుగుతోందన్నారు. కారుణ్య నియమాకాలను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. పీఆర్సీ, డీఏ అందని ద్రాక్షలా మారాయని వాపోయారు. సమావేశంలో ఆల్‌మేవా నాయకులు ఫరూఖ్, ఫక్రుద్దీన్, అన్వర్, రసూల్, అష్రఫ్‌అలీ, దౌలా, రఫీ, మహబూబ్‌బాషా, సర్దార్ పాల్గొన్నారు.

ఇంటికి దౌర్జన్యంగా తాళం!

పెద్దపప్పూరు: దాదాపు మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన ఇంటి స్థలంలో తనకూ వాటా ఉందంటూ ఓ వ్యక్తి దౌర్జన్యంగా తాళం వేయడం కలకలం రేపింది. వివరాలు.. పెద్దపప్పూరులోని రామకోటి కాలనీలో నివాసముంటున్న ఆదినారాయణ 36 ఏళ్ల క్రితం ఇంటిని నిర్మించుకున్నాడు. ప్రస్తుతం ఆ ఇంటి పక్కనే స్థలం ఉన్న చింతా రాము నాలుగు అడుగుల మేర స్థలం తన వాటాకు వస్తుందంటూ ఆదివారం ఆదినారాయణ ఇంటికి తాళం వేశాడు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



ఇంటికి తాళం వేసిన దృశ్యం

స్నేహితుడిపై కత్తితో దాడి

తాడిపత్రి టౌన్: పట్టణంలోని టైలర్స్ కాలనీకి చెందిన రఫీపై స్నేహితుడు సన్నీ కత్తితో దాడి చేశాడు. సన్నీకి సరిపడని వారితో రఫీ మాట్లాడుతున్నాడన్న కారణంగా ఆదివారం మద్యం మత్తులో కత్తితో దాడి చేసినట్లుగా తెలుస్తోంది. వీపుపై తీవ్రగాయమైన రఫీని స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. బాధితుడి పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసారు.

ట్రంప్ సుంకాలు దేశానికి నష్టం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప (చిత్రంలో) రాంభూపాల్

అనంతపురం టవర్‌క్లాక్: ట్రంప్ విధిస్తున్న సుంకాలు దేశానికి తీరని నష్టం కలిగిస్తున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ అన్నారు. 'ట్రంప్ టారిఫ్ – టెర్రరిజం – భారతదేశంపై ప్రభావం' అంశంపై ఆదివారం స్థానిక ఎన్జీఓ హోంలో సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాంభూపాల్ మాట్లాడుతూ.. ఇప్పటికే అనేక దిగుమతులపై 25 శాతం వరకు సుంకాన్ని ట్రంప్ విధించారని గుర్తు చేశారు. తాజాగా ఫార్మా దిగుమతులపై వంద శాతం సుంకం విధించారన్నారు. కొన్ని రోజులుగా హెచ్1 బీ వీసాలపై పది లక్షల డాలర్లు పన్ను వేశారన్నారు. రష్యా నుంచి చమురు దిగుమతులపై కూడా సుంకాలను అమెరికా విధిస్తోందన్నారు. ఇప్పటికే ఆక్వా రైతులు తమ ఉత్పత్తులు ఎగుమతులు చేసుకోలేక నష్టపోయే పరిస్థితి వచ్చిందన్నారు. ట్రంప్ టారీఫ్‌లపై ప్రధాని నరేంద్ర మోది నోరు విప్పాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఓ నల్లప్ప, కార్యదర్శి వర్గ సభ్యుడు బాల రంగయ్య, తదితరులు మాట్లాడారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలు ఉధృతం

- సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింగరావు



విలేకరులతో మాట్లాడుతున్న నరసింగరావు

అనంతపురం అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలు ఉధృతం చేస్తామని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు అన్నారు. సీఐటీయూ మహాసభల వేదిక వద్ద జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర కుమార్‌తో కలిసి ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడారు. విద్యుత్ ప్రైవేటీకరణ విధానాలను వీడాలన్నారు. జిల్లాలో పేదలపాలిట కల్పతరువుగా ఉన్న ఆర్‌డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్‌కు కార్మికులు పోరాటం సాగించాలన్నారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన పథకం కార్మికులపై రాజకీయ వేధింపులు ఆపకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకుని, తొలగించిన కార్మికులను విధుల్లో తీసుకోవాలన్నారు.

ముగిసిన మహాసభలు: సీఐటీయూ జిల్లా మహాసభలు ముగిశాయి. 59 మందితో సీఐటీయూ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా నాగేంద్రకుమార్ మరోసారి ఎన్నికయ్యారు.

'బాలకృష్ణ బహిరంగ క్షమాపణ చెప్పాలి'



నిరసన వ్యక్తం చేస్తున్న చిరంజీవి అభిమానులు

గుత్తి: మెగా స్టార్ చిరంజీవిపై రాష్ట్ర అసెంబ్లీలో అనుచిత వ్యాఖ్యలు చేసిన హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ బేషరత్తుగా క్షమాపణ చెప్పాలని అఖిల భారత చిరంజీవి యువత జిల్లా అధ్యక్షుడు పాటిల్ సురేష్ డిమాండ్ చేశారు. గుత్తిలో గాంధీ సర్కిల్ వద్ద ఆదివారం చిరంజీవి అభిమాన సంఘం నాయకులు ఆందోళన చేపట్టారు. బాలకృష్ణ డౌన్‌డౌన్ అంటూ ప్లకార్డులు ప్రదర్శించి, నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పాటిల్ సురేష్ మాట్లాడారు. బాలకృష్ణ క్షమాపణ చెప్పక పోతే ఆందోళన కార్యక్రమాలు విస్తృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో చిరంజీవి అభిమాన సంఘం నాయకులు బోయగడ్డ బ్రహ్మయ్య, దుర్గాప్రసాద్, ఓబులేసు, వెంకటేష్, రుద్రాక్షల రాజా, నూర్‌బాషా, నాగరాజు, హరి, షెక్షావలి తదితరులు పాల్గొన్నారు.

సంతల ఆదాయం రూ.3.62 లక్షలు

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో గత వారం జరిగిన పశువులు, జీవాల సంతల ద్వారా రూ.3.62 లక్షలకు పైగా ఆదాయం సమకూరినట్లు ఏడీఎం రాఘవేంద్ర కుమార్ తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, పొట్టేళ్ల సంత ద్వారా రూ.2,22,250 వసూలు కాగా ఆదివారం జరిగిన పశువులు, ఎద్దుల సంత నుంచి రూ.1,40,600 మేర వసూలైనట్లు వివరించారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

రాయదుర్గం టౌన్: మండలంలోని మల్లాపురం గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న 14 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. అందిన సమాచారం మేరకు ఆదివారం సీఐ జయనాయక్ ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో డ్రోన్ ఎగురవేసి, స్థావరాన్ని గుర్తించారు. అలాగే రాయదుర్గం సమీపంలోని వట్లకుంట కొండ ప్రాంతంలో సాయంత్రం చేపట్టిన తనిఖీల్లో పేకాట ఆడుతున్న 8 మందిని అరెస్ట్ చేసి, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 22 మందిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.87,150 నగదు, ఐదు ద్విచక్ర వాహనాలు, పది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

- **తాడిపత్రి రూరల్:** మండలంలోని చుక్కలూరు వద్ద ఉన్న గ్రానైట్ ఫ్యాక్టరీలు, పెన్నానది బ్రిడ్జి కింద పేకాట ఆడుతున్న 15 మంది జూదరులను అరెస్ట్ చేసినట్లు తాడిపత్రి అప్‌గ్రేడ్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. అందిన సమాచారం మేరకు ఆదివారం తనిఖీలు చేపట్టి జూదరులను అరెస్ట్ చేసి రూ.41,930 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు వివరించారు. అలాగే తాడిపత్రిలోని సీపీఐ కాలనీలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసి, రూ.37,370 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.
- **గుత్తి రూరల్:** మండలంలోని జక్కలచెరువు గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఏడుగురిని ఆదివారం పోలీసులు అరెస్టు చేశారు. సీఐ రామారావు తెలిపిన మేరకు.. గ్రామ శివారులోని ఓ తోటలో పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో పట్టుబడిని ఏడుగురిని అరెస్ట్ చేసి, నాలుగు ద్విచక్ర వాహనాలు, రూ.39,350 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా

ఆధ్యాత్మిక సేవలు అభినందనీయం

- మేయర్ వసీం



మత పెద్దలను అభినందిస్తున్న మేయర్

అనంతపురం కల్చరల్: సమాజంలో ప్రతి ఒక్కరూ నైతిక విలువలు పాటించేలా దోహదపడుతున్న మత పెద్దల కృషి అభినందనీయమని మేయర్ వసీం అన్నారు. నగర శివారులోని యాసిన్ మదరసాలో అదనపు గదుల ప్రారంభోత్సవం ఆదివారం జరిగింది. ఆత్మీయ అతిథిగా విచ్చేసిన మేయర్ వసీం మదరసా ప్రారంభోత్సవంలో ఆధ్యాత్మిక ప్రసంగం చేసిన కేరళకు చెందిన మాదిన్ అకాడమీ ప్రతినిధి మౌలానా సయ్యద్ ఇబ్రహీం ఖలీల్‌సాహెబ్, హైదరాబాదుకు చెందిన ఖురాన్ అకాడమీ ప్రతినిధి మౌలానా రిజ్వాన్ పాషా, షౌకత్ నయామ్‌లను అభినందించారు. అంతకు ముందు మత పెద్దలు మాట్లాడుతూ విద్యతోనే అభివృద్ధి సాధ్యమని, నైతిక విలువలను పెంచే విద్యనందించడమే లక్ష్యంగా అందరూ కృషి సాగించాలన్నారు. అనంతరం ఖురాన్ పూర్తి చేసుకున్న చిన్నారులను అభినందించారు. కార్యక్రమంలో మదరసా ప్రిన్సిపాల్ మహబూబ్ బాషా, మైనార్టీ డెవలప్‌మెంట్ ఫోరం నాయకులు షేక్షావలి, అబ్దుల్‌రసూల్, అన్వర్, జిలాన్, షాకిర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు రూ.50 వేల పంపిణీ



పంచాయతీ కార్మికులకు చెక్కులు అందిస్తున్న సాదిక్‌వలి

అనంతపురం రూరల్: దసరాను పురస్కరించుకొని ఎంఎస్ఎస్ సేవా సంస్థ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సాదిక్‌వలి పంచాయతీ కార్మికులకు రూ. 50 వేలను చెక్కుల రూపంలో ఆదివారం అందించారు. ఈ సందర్భంగా సాదిక్‌వలి మాట్లాడుతూ పంచాయతీ కార్మికులు సంతోషంగా పండుగ జరుపుకోవాలని ఆకాంక్షించారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే పంచాయతీ కార్మికులకు అన్ని విధాలా న్యాయం జరిగిందన్నారు. మాజీ ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి సహకారంతో పంచాయతీలో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటరాముడు, అక్కమ్మ, ఖాజా, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన మాజీ సైనికులకు సత్కారం



ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన మాజీ సైనికులను సత్కరిస్తున్న దృశ్యం

అనంతపురం: ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన మాజీ సైనికులను జిల్లా మాజీ సైనికుల సంఘం సత్కరించింది. డీఎస్సీలో ఉపాధ్యాయ పోస్టులు సాధించిన మాజీ సైనికులు పీబీ రామాంజినేయులు, ఎం.విశ్వేశ్వర రెడ్డి, డి.విజయశేఖర్‌రెడ్డిలను ఆదివారం స్థానిక హెచ్చెల్సీ కాలనీలోని మాజీ సైనికుల సంఘం కార్యాలయంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కెప్టెన్ షేకన్న ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో ట్రెజరర్ తిమ్మారెడ్డి, సిద్దన్న, నరసింహులు, బి. రవికుమార్, బీఏ హుస్సేన్, ఈశ్వరయ్య, కరణం కృష్ణ, నాగిరెడ్డి, రంగారెడ్డి, ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనంత నాటకానికి రాష్ట్ర స్థాయి గుర్తింపు

అనంతపురం కల్చరల్: గుంటూరు జిల్లా తెనాలిలో ఆదివారం జరిగిన జాతీయ స్థాయి నాటక పోటీల్లో అనంతపురంలోని లలిత కళాపరిషత్తు కళాకారులు ప్రదర్శించిన 'కాలభైరవ సంహారం' నాటకం రూ.50 వేల నగదు బహుమతిని గెలుచుకుంది. ఈ సందర్భంగా కళాకారులను, దర్శకత్వం వహించిన రంగస్థల నటుడు రామగోవింద సాగర్‌ను ఎల్కేపీ కార్యనిర్వాహక సభ్యులు అభినందించారు.

నిత్యావసర వస్తువుల వితరణ

అనంతపురం కల్చరల్: చంద్రయాన్ సేవా సమితి వ్యవస్థాపకుడు మోచి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆదివారం దసరా నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని 11 నిరుపేద కుటుంబాలకు నిత్యావసర వస్తువులనందించారు. స్థానిక ఆజాద్‌నగర్‌లోని ఆదరణ సేవా హోమ్‌లో జరిగిన కార్యక్రమానికి 'దిశా' డీఎస్పీ మహబూబ్‌బాషా, అడ్వొకేట్ ప్రణీత్ కుమార్, జమాతే ఇస్లాం ఏ హింద్ జనరల్ సెక్రటరీ హాజీపీరా, గరీబ్ కదర్ద్ ప్రతినిధి జిలాన్, ఆదరణ ఆశ్రమం తాడిమర్రి లాల్ బాషా తదితరులు హాజరయ్యారు. కులమతాలకతీతంగా నిరుపేదలకు అవసరమైన వాటిని అందిస్తున్న చంద్రయాన్ సంస్థ కృషి అభినందనీయమన్నారు.

దిష్టిబొమ్మల్లా ఏసీలు



ఐసీసీయూలో అలంకారప్రాయంగా ఉన్న ఏసీలు



అక్యూట్ మెడికల్ కేర్ యూనిట్‌లో పని చేయని ఏసీలు

- జీజీహెచ్‌లో అత్యవసర విభాగాల్లో పని చేయని వైనం

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని అత్యవసర విభాగాల్లో ఏసీలు దిష్టిబొమ్మల్లా ఉన్నాయి. కొన్ని నెలలుగా ఏసీలు పని చేయకపోవడంతో రోగులు ఇంటి నుంచి ఫ్యాన్‌లు తెచ్చుకునే దారుణమైన పరిస్థితి నెలకొంది. ఆస్పత్రిలో అక్యూట్ మెడికల్ కేర్, ఐసీసీయూ, ఆపరేషన్ థియేటర్లలో ఏసీలు ఒక్కటి కూడా పని చేయడం లేదు. దీంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏసీల నిర్వహణకు సంబంధించి సర్వజనాస్పత్రి అధికారులు ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదు. ఏసీలు ఉంటే రోగులు డీహైడ్రేషన్‌కు గురి కాకుండా త్వరగా కోలుకునేందుకు వీలుంటుంది. కాలిన గాయాలు ఉన్న వారికి మరింత ఉపశమనంగా ఉంటుంది. అత్యంత ప్రాధాన్యత కల్గిన వార్డుల్లో సైతం ఏసీలు పనిచేయకపోవడం దారుణమని రోగులు అంటున్నారు. ఐసీసీయూలో ఏసీలు పని చేయకపోవడంతో కిటికీలు తెరిచి ఉంచే పరిస్థితి ఏర్పడింది. ఇక్కడ నెలకొన్న సమస్యలపై ఆస్పత్రి అధికారులు దృష్టి సారించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. కేవలం ఫొటోలు తీసుకుని కలెక్టర్‌కు పంపడం..ఇంతటితో ఇవాళ తమ పని అయిపోయిందంటూ ఇళ్లకు పరుగులు పెట్టడం పరిపాటిగా మారింది.

భక్తజనం.. ఆనంద పరవశం



కొత్తూరు అమ్మవారి శాలలో గరుడ వేంకట లక్ష్మీనారాయణ అలంకారం



పాతూరు అమ్మవారి శాలలో స్కందమాత దేవి అలంకారం



పాతూరులో రేణుకా యల్లమ్మ తల్లి



పంపనూరులో అలంకరణలో అమ్మవారు



చిన్మయనగర్‌లో మహాచండికా దేవి

అనంతపురం కల్చరల్: దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు భక్తులను ఆనంద పరవశులను చేస్తున్నాయి. భక్తులతో నగరంలోని అమ్మవారి ఆలయాలు కిటకిటలాడుతున్నాయి. ఆదివారం విభిన్న రూపాలలో అమ్మవారు అవతరించి భక్తులను ఆశీర్వదించారు. నగరంలోని కొత్తూరు, పాతూరు వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయాలలో విశేష అలంకార సేవలు, ప్రత్యేక పూజోత్సవాలు శాస్త్రోక్తంగా సాగాయి. హెచ్చెల్సీ కాలనీలోని శ్రీనసనకోట ముత్యాలమ్మ ఆలయం, వలీస్వామి ఆశ్రమ ప్రాంగణంలోని కొల్హాపూరు మహాలక్ష్మి, శివబాలయోగి ఆశ్రమం, ఉమానగర్ రేణుకాయల్లమ్మ ఆలయం, శివకోటి, శంకర మఠం, అర్బన్ బ్యాంకు సమీపంలో ఏర్పాటు చేసిన కనకదుర్గ మాత తదితర చోట్ల పెద్ద ఎత్తున పూజోత్సవాలు సాగాయి. రెండోరోడ్డు శ్రీ జ్ఞానపీఠంలో చండీహోమాలు, లలితా సహస్రనామ పారాయణాలలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని తీర్థ ప్రసాదాలందుకున్నారు. తపోవనం వేదమాత గాయత్రి ఆలయంలో దేవరకొండ కౌసల్య శిష్యబృందాలు కోలాట నాట్యాలతో అమ్మవారికి నీరాజనాలర్పించారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

గరుడ వాహనంపై శ్రీవారి విహారం

అనంతపురం కల్చరల్: నగరంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు భక్తిభావాన్ని రెట్టింపు చేస్తూ నయనానందకరంగా సాగుతున్నాయి. తిరుమలను తలపిస్తూ జరిగిన సంబరాలలో భాగంగా ఆదివారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేతుడై శ్రీవారు గరుడ వాహనంపై పురవీధుల్లో దర్శనమిచ్చి పూజలందుకున్నారు. ఆర్ఎఫ్ రోడ్డు లక్ష్మీ వేంకటేశ్వరాలయంలో జరిగిన వివిధ రకాల అభిషేకాలు, హోమాల్లో పలువురు అధికారులు పాల్గొన్నారు. రాత్రి శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడు పురవీధుల్లో ఊరేగుతున్నప్పుడు కళాకారులు సంప్రదాయ నృత్యాలతో, భజన బృందాలు భక్తిగీతాలతో నీరాజనాలర్పించారు. నగరంలోని శ్రీనివాసనగర్, హౌసింగు బోర్డుల్లోని వేంకటేశ్వరాలయాల్లోనూ శ్రీవారి బ్రహ్మోత్సవాలు నేత్రపర్వంగా సాగుతున్నాయి. భక్తులు బారులు తీరి స్వామివారిని దర్శించుకుంటున్నారు.

ఘనంగా భాగవత సప్తాహం

అనంతపురం కల్చరల్: నగరంలోని కోర్టురోడ్డు వరదాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం భాగవత సప్తాహం ఘనంగా సాగింది. నార్పలకు చెందిన తిక్కయ్య స్వామి భాగవత భక్త సమాజం వారు నిర్వహిస్తున్న సప్తాహంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. నైతిక విలువలను పెంచే పురాణేతిహాసాలపై యువతరం శ్రద్ధ చూపాలని నిర్వాహకులన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం ముగింపు వేడుకలుంటాయని వెల్లడించారు. అక్టోబర్ 6 నుంచి నార్పల మండలం కూరగాయనిపల్లిలో భాగవత సప్తాహం జరుగుతుందని, రోజూ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం వరకూ ఆధ్యాత్మిక ప్రసంగాలు ఉంటాయని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పార్టీకి పనిచేశారని.. 'పచ్చ' చీరలిచ్చారు!

అనంతపురం కార్పొరేషన్: అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ దసరా పండుగ పేరుతో ఆదివారం మెప్మా రీసోర్స్ పర్సన్ల (ఆర్‌పీలు)కు చీరలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి.. అందరికీ పసుపు రంగు చీరలను అందజేశారు. ఇటీవల నిర్వహించిన సూపర్‌సిక్స్..సూపర్ హిట్ కార్యక్రమానికి నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి మహిళలను బలవంతంగా తరలించడంలో మెప్మా ఆర్‌పీలు కీలకంగా వ్యవహరించారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే దగ్గుపాటి వారికి చీరలు పంపిణీ చేసినట్లు టీడీపీ వర్గాలు అంటున్నాయి. అయితే.. పసుపు రంగు చీరలు ఇవ్వడంతో కొందరు ఆర్‌పీలు నివ్వెరపోయారు. ఈ మొత్తం కార్యక్రమాన్ని మెప్మా పీడీ డైరెక్షన్‌లో ఓ ఉద్యోగి సమన్వయం చేయడం గమనార్హం.

పెన్షన్.. టెన్షన్

- పింఛన్లు పంచబోమంటున్న సచివాలయ ఉద్యోగులు
- బ్యాంకుల నుంచి డబ్బుల డ్రాకు నిరాకరణ
- అధికారులు, లబ్ధిదారుల్లో ఆందోళన

అనంతపురం కార్పొరేషన్: డిమాండ్ల సాధన కోసం సమ్మె నోటీసు ఇచ్చిన సచివాలయ ఉద్యోగులు పింఛన్ల పంపిణీకి విముఖత చూపుతున్నారు. దీంతో ఇటు అధికారులకు, అటు లబ్ధిదారులకు టెన్షన్ పట్టుకుంది. కొన్ని రోజులుగా సచివాలయ ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఆందోళన చేస్తున్నారు. ఈ క్రమంలోనే త్వరలోనే సమ్మెలోకి వెళతామని నగరపాలక సంస్థ కమిషనర్‌కు నోటీసు అందజేశారు. ఈ నేపథ్యంలో అక్టోబరు ఒకటో తేదీన పింఛన్లు పంచబోమని స్పష్టం చేశారు. నగరంలోని 74 సచివాలయాల పరిధిలో 22,668 మంది పింఛన్‌దారులు ఉన్నారు. వీరికి ప్రతి నెలా రూ.10 కోట్లకు పైగా అందజేస్తున్నారు. సచివాలయ ఉద్యోగులు ప్రతి నెలా పింఛన్ పంపిణీకి రెండ్రోజుల ముందే వివిధ బ్యాంకుల నుంచి డబ్బు డ్రా చేసేవారు. కానీ ఈసారి పింఛన్ డబ్బు డ్రా చేయబోమని తేల్చి చెప్పడంతో నగర పాలక సంస్థ అధికారులు అయోమయంలో పడ్డారు. సచివాలయ ఉద్యోగులు పింఛన్ పంపిణీ చేపట్టని పక్షంలో వేలాది మంది లబ్ధిదారులు నగరపాలక సంస్థ కార్యాలయానికి ప్రదక్షిణలు చేయాల్సి వస్తుంది. ఇప్పటికే కూటమి ప్రభుత్వంలో వృద్ధులు, వికలాంగుల పింఛన్లలో కోత విధించడంతో ప్రభుత్వ ఆస్పత్రులు, నగర పాలక సంస్థ చుట్టూ తిరుగుతూ ప్రత్యక్ష నరకం చూస్తున్నారు. ఇప్పుడు సచివాలయ ఉద్యోగుల విముఖత కారణంగా టెన్షన్ మొదలవడంతో ఇంకా ఎన్ని అవస్థలు పడాల్సి వస్తుందోనని లబ్ధిదారులు వాపోతున్నారు.

గ్రూపుల నుంచి లెఫ్ట్..

పింఛన్ల పంపిణీకి సంబంధించిన గ్రూపుల నుంచి కొంత మంది సచివాలయ ఉద్యోగులు లెఫ్ట్ కావడం చర్చనీయాంశమైంది. నగరంలో సచివాలయ ఉద్యోగుల నిరసనలు రోజు రోజుకూ అధికమవుతున్నాయి. రానున్న రోజుల్లో సమ్మెలోకి వెళితే ప్రజలకు మరిన్ని ఇబ్బందులు తలెత్తే అవకాశముంది. సచివాలయ ఉద్యోగులు ముందుకు రాకపోతే అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్ల ద్వారా పింఛన్ల పంపిణీ చేపట్టాలనే ఆలోచనలో నగర పాలక సంస్థ అధికారులు ఉన్నట్లు సమాచారం.

మాలల అభ్యున్నతే ధ్యేయం



ఓబులేసును సన్మానిస్తున్న నాయకులు

అనంతపురం టవర్‌క్లాక్: మాలల అభ్యున్నతే ధ్యేయమని మాల మహానాడు జిల్లా నూతన అధ్యక్షుడు సుగమంచి శ్రీనివాసులు అన్నారు. ఆదివారం స్థానిక ఎస్‌వీఆర్ పోలీసు చెన్నప్ప ఫంక్షన్ హాలులో మాల మహానాడు జిల్లా నూతన కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా సుగమంచి శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా ఇండ్ల రమేష్ బాబు, ప్రధాన కార్యదర్శిగా చియ్యేడు రాము, కార్యదర్శిగా నీలూరి సురేష్ బాబు, కోశాధికారిగా సోమశేఖర్, రాప్తాడు నియోజకవర్గ అధ్యక్షుడిగా విజయ్ కుమార్‌ను ఎంపిక చేశారు. అలాగే నగర అధ్యక్షుడిగా సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా సురేంద్ర, ఉపాధ్యక్షులుగా బాబు, కార్యదర్శిగా జయరామ్, కోశాధికారిగా అనిల్ కుమార్, మహిళా జిల్లా అధ్యక్షురాలిగా సీకే శ్రీదేవి, ప్రధాన కార్యదర్శిగా ఉరుముల సుమలత తదితరులను ఎన్నుకున్నారు. అనంతరం పూర్వపు జిల్లా అధ్యక్షుడు దళితరత్న ఓబులేసును ఘనంగా సన్మానించారు.

కరెన్సీ నోట్లపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాలి

రాప్తాడురూరల్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫొటోను కరెన్సీ నోట్లపై ముద్రించాలని మాదిగ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు చిన్న ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. ఆదివారం అనంతపురం రూరల్ రాచానపల్లి ఎస్సీ కాలనీ ఫెర్రర్ కమ్యూనిటీ హాలులో ఎంహెచ్‌పీఎస్ కార్యకర్తల సమావేశం జరిగింది. స్థానిక నాయకుడు మన్నల సుబ్రమణ్యం అధ్యక్షతన జరిగిన సమావేశానికి చిన్న ఈశ్వరయ్య హాజరయ్యారు. వారు మాట్లాడుతూ జిల్లాలో దళితులపై దాడులు పెరుగుతున్నాయని, అరికట్టేందుకు ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఆర్డీటీ ఎఫ్‌సీఆర్ఏ రెన్యూవల్ చేయకుండా అడ్డంకులు సృష్టించడం అన్యాయమన్నారు. నాయకులు ఎస్.రామతీర్థ, జూటూరు రామాంజనేయులు, చియ్యేడు నారాయణస్వామి, హెచ్.నాగన్న, కేఎస్ రాము, వరకూటి కాటమయ్య పాల్గొన్నారు.

ఫర్నీచర్ ధ్వంసంపై కేసు

అనంతపురం: నగరంలోని 'అమ్మ' ఆసుపత్రిలో ఫర్నీచర్ ధ్వంసం చేసిన ఘటనలో పలువురిపై త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. డాక్టర్ శివజ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. ఈ నెల 19న జయసింహ భార్య శిరీష 'అమ్మ' ఆసుపత్రిలో అడ్మిట్ అయ్యారు. 20న సిజేరియన్ చేయడంతో మగ బిడ్డ జన్మించాడు. బిడ్డ ఊపిరి పీల్చుకోవడంలో ఇబ్బంది పడుతుండడంతో ఆక్సిజన్, వార్మర్ పెట్టారు. పరిస్థితి మెరుగు పడకపోవడంతో వారు హృదయ చిన్న పిల్లల ఆసుపత్రికి వెళ్లి, అక్కడి నుంచి సర్వజనాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ 25న శిశువు చనిపోయాడు. దీంతో ఈ నెల 26న సాయంత్రం బిడ్డ తల్లిదండ్రులతో పాటు పుష్పరాజ్, రాజు అనే వ్యక్తులు ఆసుపత్రిలోని గ్లాస్ టేబుల్స్, కంప్యూటర్, ప్రింటర్, కుర్చీలను ధ్వంసం చేశారు. వీటి విలువ సుమారు రూ.10 వేలు ఉంటుంది. నిందితులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలంటూ ఫిర్యాదు చేశారు.

కొలువుదీరిన శివాలయం ధర్మకర్తల మండలి

అనంతపురం కల్చరల్: వందేళ్ల చరిత్ర కల్గిన పురాతన మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వరాలయం నూతన ధర్మకర్తల మండలి కొలువుదీరింది. ఈ మేరకు ఆదివారం స్థానిక మొదటి రోడ్డు శివాలయంలో జరిగిన ప్రమాణ స్వీకారోత్సవంలో నూతన కమిటీ సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. ధర్మకర్తల మండలి అధ్యక్షునిగా నరేంద్ర చౌదరి, కార్యనిర్వాహక సభ్యులుగా రాజు, బోయ వెంకటరమణమ్మ, దేవరకొండ రత్నమ్మ, వనితబాయి, చరణ్‌తేజ్, ఆదిశేషయ్య, బన్యాల రాధ, అనంత కుమారి, విష్ణువర్ధన్, శ్రీదేవి కమిటీలో ఉంటారని సీనియర్ అర్చకుడు కిషోర్‌కుమార్ ఎక్స్ అఫిషియో సభ్యుడిగా వ్యవహరిస్తారని ఆలయ ప్రతినిధులు తెలిపారు. కో ఆప్షన్ మెంబర్ లక్ష్మీరెడ్డి, పలు ఆధ్యాత్మిక సంస్థల ప్రతినిధులు కమిటీ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఎండోమెంటు జిల్లా ఇన్‌స్పెక్టర్ వన్నూరుస్వామి ఉన్నారు.

కార్యదర్శి పదవికి నక్షత్ర రాజీనామా

అనంతపురం అర్బన్: సీఐటీయూ అనుబంధంగా ఉన్న అంగన్‌వాడీ వర్కర్ల సంఘం అర్బన్ ప్రాజెక్టు కార్యదర్శి పదవికి రాజీనామా చేస్తున్నట్లు అంగన్‌వాడీ టీచర్ నక్షత్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నానని, ఇక నుంచి సీఐటీయూకు తనకు ఎలాంటి సంబంధం లేదని ప్రకటనలో పేర్కొన్నారు.

పొట్లూరి హరికృష్ణకు జాషువా పురస్కారం



జాషువా పురస్కారమందుకుంటున్న పొట్లూరి హరికృష్ణ

అనంతపురం కల్చరల్: రాష్ట్ర స్థాయిలో ప్రతిష్టాత్మకంగా అందించే మహాకవి జాషువా పురస్కారం ఈ ఏడాది అనంతపురానికి చెందిన తెలుగు రక్షణ వేదిక జాతీయ అధ్యక్షుడు పొట్లూరి హరికృష్ణ అందుకున్నారు. గుర్రం జాషువా జయంతి సందర్భంగా విజయవాడలో జరిగిన పురస్కార ప్రదానోత్సవంలో మంత్రి కందుల దుర్గేష్, నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, కల్చరల్ కమిషన్ చైర్మన్ తేజస్విని, కలెక్టర్ లక్ష్మీషా చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను జిల్లా సాహిత్య సంస్థల ప్రతినిధులు అభినందించారు.

జాషువాకు ఘన నివాళి..

అసమానతలు లేని సమాజం కోసం పరితపించిన మహాకవి జాషువా జీవితం ఆదర్శప్రాయమని పలువురు వక్తలన్నారు. గుర్రం జాషువా 130వ జయంతి సందర్భంగా ఆదివారం అనంతపురంలోని ఆర్ట్స్ కాలేజ్ సమీపంలో ఉన్న జాషువా విగ్రహానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, పలువురు రచయితలు, కవులు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గుర్రం జాషువా సాహిత్య పీఠం ప్రతినిధి నాగలింగయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి మంత్రి సత్యకుమార్, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కరరెడ్డి, వాసంతి సాహిత్యతో పాటూ సాహితీ వేత్తలు డాక్టర్ నానీల నాగేంద్ర, పూజారి ఈరన్న, తదితరులు హాజరై, మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్కేయూ మాజీ రిజిస్ట్రార్ సుధాకరబాబు, మాజీ ప్రిన్సిపాల్ రంగస్వామి, సాకే హరి, శంకర కుళ్లాయప్ప, రియాజుద్దీన్, అశ్వత్థరెడ్డి, తోట నాగరాజు, వెంకట సుబ్బయ్య, షరీఫ్, బీజేపీ నాయకులు లలిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సేవా మందిరం తలమానికంగా నిలవాలి

- స్వామి సుకృతానంద మహారాజ్



దిశానిర్దేశనం చేస్తున్న సుకృతానంద మహారాజ్

అనంతపురం కల్చరల్: జిల్లా కేంద్రంలోని హెచ్చెల్సీ కాలనీలో నిర్మాణమవుతున్న శ్రీరామకృష్ణ విశ్వజనీన సేవా మందిరం 'అనంత'కే తలమానికంగా నిలవాలని స్వామి సుకృతానంద మహారాజ్ అన్నారు. నవంబరులో జాతీయస్థాయి నాయకులు, రామకృష్ణ మిషన్ ప్రతినిధులతో అనంత వేదికగా సాగనున్న భక్త సమ్మేళనం నిర్వహణ పనులను పర్యవేక్షించడానికి స్వామి సుకృతానంద మహారాజ్ ఆదివారం జిల్లాకొచ్చారు. ఈ సందర్భంగా స్థానిక రామకృష్ణ సేవాసమితి ప్రాంగణంలో సమితి ప్రతినిధులు, భక్తులతో సమావేశమై దిశానిర్దేశనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక శక్తి మనిషిని ఎంత దూరమైనా ఆనందంగా, శక్తివంతంగా నడిపిస్తుందని అటువంటి సద్గురువుల సేవా మందిరం శోభాయమానంగా రూపుదిద్దుకోవడం శుభపరిణామమన్నారు. జిల్లా కేంద్రంగా మరో ఆధ్యాత్మిక క్షేత్రంగా విరాజిల్లే మందిరంలో నిత్యం ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లాలని ఆకాంక్షించారు. సమితి ప్రతినిధులు శ్రీధరమూర్తి, ప్రవీణ్ మాట్లాడుతూ నవంబర్ 28 నుంచి మూడురోజుల పాటు నగరంలో రామకృష్ణుల దివ్యమందిర ప్రారంభం, భక్త సమ్మేళనం ఉంటాయని అందరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షులు కృష్ణశౌ, జయపాల్‌రెడ్డి, కేశవమూర్తి, భాస్కర్, పురుషోత్తమ్ తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో ప్రభుత్వంపై పోరాటాలు

- ఏఐవైఎఫ్ నాయకులు

అనంతపురం అర్బన్: యువతకు ఇచ్చిన హామీల అమలుకు కూటమి ప్రభుత్వంపై విప్లవ వీరుడు సర్దార్ భగత్‌సింగ్ స్ఫూర్తితో పోరాటాలు సాగిస్తామని ఏఐవైఎఫ్ నాయకులు అన్నారు.భగత్‌సింగ్ 118వ జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక క్లాక్‌టవర్ సమీపంలోని ఆయన విగ్రహానికి ఏఐవైఎఫ్ నాయకులు పాలాభిషేకం చేసి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కుళ్లాయిస్వామి మాట్లాడారు. స్వాతంత్ర్య పోరాటంలో భగత్ సింగ్ చూపిన తెగువ, ధైర్యసాహసాలు, ఆలోచనలు నేటి యువతకు మార్గదర్శకమన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో భగత్ సింగ్ చూపిన పోరాట మార్గంలో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు దేవేంద్ర, ధనుంజయ, చందు, శ్రీనివాస్, మంజునాథ్, ఆనంద్, నాని, సమీర్, బాబ్జాన్, ప్రశాంత్, రాంబాబు, సురేంద్ర, అశోక్, కన్నా, తేజ, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం ఎడ్యుకేషన్: భగత్ సింగ్‌ను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని ఆలిండియా డెమొక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ (ఏఐడీఎస్ఓ) రాష్ట్ర అధ్యక్షుడు వి.హరీష్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. భగత్ సింగ్ 118వ జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక ఆర్ట్స్ కళాశాల వద్ద విగ్రహానికి ఏఐడీఎస్ఓ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. ఏఐడీఎస్ఓ నగర కార్యదర్శి చరణ్ తేజ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా హరీష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికీ భగత్ సింగ్ కన్న కలల స్వాతంత్ర్యం రాలేదని వాపోయారు. జిల్లా ఇన్‌చార్జ్ బి. సురేష్ మాట్లాడుతూ నేడు ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య వరకు పాలకులు నాశనం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ విద్యను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో ఏఐడీఎస్ఓ రాష్ట్ర కార్యదర్శి మహేష్, నగర సభ్యులు నాని, నవీన్, యూత్ ఆర్గనైజషన్ నాయకులు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కల్యాణం.. వైభోగం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం శుద్ధ షష్ఠిని పురస్కరించుకొని కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. తొలుత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, శ్రీవల్లి, దేవసేన ఉత్సవ విగ్రహాలను పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. వేద పండితుల మంత్రాల నడుమ మంగళవాయిద్యాలతో కల్యాణోత్సవం నేత్రపర్వంగా సాగింది.

పంచామృతాభిషేకాలు..

కల్యాణోత్సవం అనంతరం ఆలయంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి మూల విరాట్‌కు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్వామి స్వర్ణకవచాన్ని ఆలయం చుట్టూ మేళతాళాలతో ప్రదక్షిణలు చేయించారు. ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తు కాలసర్పదోష నివారణ రాహుకేతు హోమాలు నిర్వహించారు. ఆలయంలోని మంజునాథ స్వామికి, పార్వతీదేవికి పూజలు చేసి, మహా మంగళహారతి అందించారు. భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం నిర్వహించారు.

జాషువా సాహిత్యం నిత్య చైతన్యవంతం



మాట్లాడుతున్న ఆచార్య కాడా రామకృష్ణారెడ్డి

అనంతపురం కల్చరల్: మహాకవి గుర్రం జాషువా సాహిత్యం నిత్యం చైతన్యవంతంగా సాగిందని వక్తలన్నారు. వేమన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జాషువా జయంతి వేడుకలను నిర్వహించారు. ఫౌండేషన్ కార్యాలయంలో జరిగిన వేడుకలకు మాజీ వీసీ కాడా రామకృష్ణారెడ్డి అధ్యక్షత వహించగా, ప్రముఖ విమర్శకులు డాక్టర్ కల్లూరి ఆనందరావు, డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి మాట్లాడారు. సమాజ స్థితిగతులను పద్యం ద్వారా ఎలుగెత్తి చాటిన జాషువా నిత్యస్మరణీయుడన్నారు. ప్రముఖ పద్యగాయకులు వెంకటేశ్వరప్రసాద్ ఆలపించిన పద్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వేమన ఫౌండేషన్ సభ్యులు లోకన్న, కృష్ణారెడ్డి, నాగశేషారెడ్డి, కవులు సురేష్, మధురశ్రీ, వన్నప్ప, వీరభద్రప్ప, టీవీరెడ్డి, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.